క్లుప్తంగా

పరామర్శ

దక్కిలి/వెంకటగిరి రూరల్: మండలంలోని పలుగోడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదిరెడ్డి మల్లికార్జునరెడ్డిని ఆదివారం చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్టు ప్రతినిధులు 25 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గన్నం సేవా ట్రస్టు చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు జైసాల్‌రెడ్డి హరినాథ్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఒంగోలుజాతి ఎడ్ల బండి పోటీలు

కోట : మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కొక్కుపాడు సమీపంలోని మహాలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఒంగోలు జాతి ఎడ్లబండి పోటీలు, ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బాలసుబ్రమణ్యంశెట్టి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు, ఐదో బహుమతి రూ.3 వేలు అందజేస్తామన్నారు. వివరాల కోసం 9959220092, 9440012451 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

దక్కిలి : చెత్త నుంచి సంపద తయారీ చేసి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలని గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ తెలిపారు. ఆయన ఆదివారం మోపూరువెల్లంపల్లి పంచాయతీలో చెత్త సేకరణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. అనంతరం ఆయన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అల్లాబక్షు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఓజిలి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని డీఎల్‌పీవో రవీంద్రబాబు తెలిపారు. ఆయన ఆదివారం కురుగొండ, మానమాల, ఓజిలి, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. దాన్ని చెత్త సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేస్తామని తెలిపారు. చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచులు, కార్యదర్శులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఇనుప కంచె, గేట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ట్యాంకులలో క్లోరినేషన్ చేయించాలని, కాలువల్లో మురుగును తొలగించాలని తెలిపారు. అనంతరం ప్రజలకు డస్టబిన్లు పంపిణీ చేశారు. అలాగే భట్లకనుపూరు, అత్తివరం గ్రామాల్లో ఈవోపీఆర్డీ ఎం.రేణుక పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకయ్య, సుమ, డీఏ వెంకటేష్, సర్వేయర్ నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు మల్లాపు భాస్కర్ (ఫైల్)

చిట్టమూరు/నాయుడుపేట టౌన్ : మండలంలోని మల్లాం పంచాయతీ కొక్కుపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మల్లాపు భాస్కర్ (42) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. జనవరి 31న నాయుడుపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరుకు తరలించి వైద్యం చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని ప్రయివేట్ వైద్యశాలలో చేర్చారు. ఈ క్రమంలో ఆయన మృతిచెందాడు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు.

మామూళ్లు ఇస్తే రైట్ రైట్

ఆ పోలీసు అధికారికి స్వర్ణముఖి నది వరంలా మారింది. ఇసుక తరలించే వారు ట్రాక్టర్‌కు రూ.10 వేలు నెల మామూళ్లు ఇవ్వాలి. లేకుంటే నదిలోకి ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలు లేకుండా దారికి అడ్డంగా గాడి తవ్విస్తాడు. ఇసుక వ్యాపారులతోనే నిఘా పెట్టించి కేసులు నమోదు చేస్తాడు. బేరం కుదిరాక ఆ గాడిని పూడ్చేయిస్తాడు. సమాచారం అంది ఉన్నతాధికారులు అక్కడికి వస్తే ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తూ ఉంటాడు. ఈ తతంతం ఆరు నెలలుగా యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని స్వర్ణముఖి నదిని కాపాడాలని కోరుతున్నారు.

- ఇసుక వ్యాపారులతో ఆ పోలీసు బేరాలు
- ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చెల్లించాల్సిందే
- లేకుంటే స్వర్ణముఖ నదిలోకి ట్రాక్టర్ వెళ్లదంతే..!
- కలెక్షనే ఆ పోలీసు అధికారి నైజం



దిగువచావలి వద్ద స్వర్ణముఖినది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

పెళ్లకూరు : మండలం గుండా ప్రవహిస్తున్న స్వర్ణముఖినది అనేక మందికి జీవనాధారంగా ఉంది. ఈ నది నుంచి 18 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అలాగే 27 గ్రామాల్లోని 17 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకం ద్వారా ఇతర ప్రాంతాల్లోని తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అంతేగాక నదిలోని ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. కలవకూరు, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, చింతపూడి, రావులపాడు, పెన్నేపల్లి, దిగువచావలి, కప్పగుంటకండ్రి, పాలచ్చూరు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. దీన్ని కట్టడి చేయాల్సిన పోలీసు అధికారి ఇసుక వ్యాపారులతో బేరాలు కుదుర్చుకుని వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలకు ట్రాక్టర్‌కు రూ.10 వేలు చెల్లించాలని హుకుం జారీ చేసినట్టు సమాచారం. అంతటితో ఆగక ఆయా ప్రాంతాల వ్యాపారులతోనే నిఘా ఏర్పాటు చేయిస్తున్నాడు. మామూళ్లు ఇవ్వని వారిపై కేసులు నమోదు చేయడం షరా మామూలుగా మారిపోయింది. ఇసుక అక్రమ రవాణా విషయం మీడియా ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి రాగానే ఏమీ తెలియనట్లు స్వర్ణముఖినదిలోకి వాహనాలు వెళ్లకుండా యంత్రాలతో గాడి తవ్వించడం ఆరు మాసాలుగా కొనసాగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.



రాజుపాళెంలో మద్యం బెల్టు దుకాణం

గతంలో నెలకు రూ.25 వేలు వసూలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి రోజుల్లో ఇసుకను వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాల్లో విక్రయించేవారు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పైగా పలికేది. ఇక్కడి పోలీసు అధికారి ఒక్కో ట్రాక్టర్ నుంచి నెలకు రూ.25 వేలు మామూళ్లు తీసుకున్నట్టు సమాచారం. మండలంలోని కలవకూరు, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, చింతపూడి, రావులపాడు, పెన్నేపల్లి, దిగువచావలి, కప్పగుంటకండ్రి, పాలచ్చూరు గ్రామాల్లో సుమారు 70 ట్రాక్టర్లు ఉండగా నెలకు రూ.1.75 లక్షలు వసూలు చేసేవాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇసుకను ఉచితం చేయడంతో పట్టణాల్లో ధర తగ్గింది. దీంతో మామూలును తగ్గించి నెలకు రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు.

సస్పెన్షన్ వేటు పడినా..

ఈ పోలీసు అధికారి డక్కిలి మండలంలో పని చేసే సమయంలో వసూల్ రాజాగా గుర్తించిన జిల్లా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఏదో విధంగా మళ్లీ పెళ్లకూరులో బాధ్యతలు చేపట్టారు. అయినా ఆయన తీరులో మార్పు రాలేదు. జాతీయ రహదారిపై ప్రతి శుక్రవారమూ సంతల నుంచి వెళ్లే గేదెలు, గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలను రవాణా చేసే వాహనాల నుంచి డబ్బు వసూలు చేస్తున్నాడు. అలాగే వరికోత యంత్రాలు, చిల్లకూరు, గుర్రప్పతోట, టెంకాయతోపు గ్రామాల వద్ద అక్రమ డీజిల్ వ్యాపారులు, బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి కూడా డబ్బు వసూలు చేస్తున్నట్టు సమాచారం. చిన్నచిన్న వివాదాలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారిని తనదైన శైలిలో బెదిరించి ఇరు పక్షాల నుంచి నగదు వసూలు చేసుకోవడం ఆయనకు పరిపాటిగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవినీతికి పాల్పడుతున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.







స్వర్ణముఖినదిలోకి వాహనాలు వెళ్లకుండా దారికి అడ్డంగా తీసిన గాడి, కలవకూరు వద్ద స్వర్ణముఖినది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, వరికోత యంత్రాల నుండి నగదు వసూలు చేస్తున్న పోలీసులు

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరు దాతలు రూ.2 లక్షల విరాళం అందజేసినట్టు అధికారులు తెలిపారు. నాయుడుపేటకు చెందిన సిద్ధంశెట్టి నరసింహులు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె జనని, కుమారుడు రామ్‌చరణ్ రూ.లక్ష, అలాగే అన్నమయ్య జిల్లా చిట్వేలికి చెందిన మోక్షిత, వేదాన్స్, పద్మ ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష అందజేసినట్టు తెలిపారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

కోట: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఆదివారం గూడూరు, సూళ్లూరుపేట పరిధిలోని 13 హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత, ఒత్తిడిని ఎదుర్కోవడంపై మోటివేషన్ క్యాంప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండా విషయాన్ని అర్థం చేసుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, సబ్జెక్ట్ టీచర్లు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూవోలు మనోజ్, సుధామయి పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక సర్వీసులు

కోట: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న పంట్రంగం శైవక్షేత్రానికి ఆరు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. ఈ ప్రాంతంలో పంట్రంగం దేవస్థానానికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, ఈ క్రమంలో ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. కోట నుంచి పంట్రంగం దేవస్థానానికి గంట గంటకు బస్సు ఉండేలా ఆరు సర్వీసులు నడుపుతున్నట్టు తెలిపారు.

పేదల ఉపాధిపై దెబ్బకొట్టడం తగదు

నాయుడుపేట టౌన్ : మున్సిపాలిటీ అవసరాల కోసం కేటాయించిన సెప్టిక్ ట్యాంకర్‌ను బాడుగకు ఇవ్వాలని నిర్ణయించడం తగదని సమైక్య మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు మాసారం గోపాల్ తెలిపారు. ఆయన ఆదివారం ఎస్ఎస్ఆర్ కాలనీ వద్ద విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద కార్మికుల సంక్షేమ కోసం సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే ట్యాంకర్లను సబ్సిడీతో ఇచ్చిందన్నారు. వాటితో ఉపాధి పొంది కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ అవసరాలకు కోసం కేటాయించిన ట్యాంకర్లను బాడుగకు తిప్పాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో పేదలు నడుపుతున్న ట్యాంకర్లకు ఆదరణ తగ్గిపోయి వారు వీధిన పడతారని తెలిపారు. గత ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం పనిచేస్తే నేటి ప్రభుత్వం వారి కడుపు కొట్టేలా చర్యలు చేపడుతోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. దీనిపై కార్మికులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్టు వెల్లడించారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

నాయుడుపేట టౌన్ : మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని నాయుడుపేట పట్టణంలో ఏర్పాటు చేయడానికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదివారం నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సీఎస్ తేజ సెంటర్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో విగ్రహం ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించినట్టు తెలిసింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి, పల్లమాల రామిరెడ్డి, పసల గంగా ప్రసాద్, మైలారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులురెడ్డికి ఘన నివాళి



శ్రీనివాసులురెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోట: రాష్ట్ర మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి వర్ధంతిని ఆదివారం కోటలో ఘనంగా నిర్వహించారు. కోట బజారువీధిలో ఉన్న శ్రీనివాసులురెడ్డి విగ్రహానికి అభిమానులు, రాజకీయ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాది భాస్కర్, న్యాయవాది గోపాల్‌రెడ్డి, ఆనందరావు, సారంగం రమేష్‌బాబు, వెంకయ్య పాల్గొన్నారు.

ఎట్టకేలకు శిలాఫలకంలో పేర్లు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని వల్లివేడు క్రాస్ రోడ్డు సమీపంలో నగరవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకంలో ఎట్టకేలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి పేర్లను నమోదు చేశారు. ఈ నెల 12న స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అటవీ సంరక్షణ అధికారి (ఎఫ్ఏసీ) పి.సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ ఆధ్వర్యంలో నగర వనాన్ని ప్రారంభించారు. ఆ శిలాఫలకంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, స్థానిక ఎంపీ గురుమూర్తి, జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పేర్లు లేవు. దీనిపై వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశంలో ఎండగట్టారు. దీంతో స్పందించిన అధికారులు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, మంత్రుల పేర్లను జోడించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు.

ఒలంపియాడ్ పరీక్షకు ప్రగతి పాఠశాల విద్యార్థులు

కోట : హైదరాబాద్‌కు చెందిన ఈ–అభ్యాస్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో నిర్వహించిన కలాం సైన్స్ అప్టిట్యూడ్ టెస్ట్ లెవెల్–2 పోటీ పరీక్షకు కోటలోని ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు 47 మంది పాల్గొన్నారు. తమ విద్యా సంస్థలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్ కిషోర్ తెలిపారు. అందువల్లే విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు.

కనుల పండువగా లక్ష్మీనారాయణుల కల్యాణం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ బాలాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీ నారాయణుల (వేప, రావిచెట్లకు) కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి దివి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ఆవరణలోని వేపచెట్టు, రావి చెట్టుకు కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

మల్లాంలో..

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో స్వయంభువుగా వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు వేశారు. శాంతి కల్యాణానికి గుంటూరుకు చెందిన వేణు, చందన ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఇందుకు ఉభయకర్తలుగా చిల్లకూరు మండలం కడివేడుకు చెందిన ప్రభాకర్, విజయమ్మ వ్యవహరించారు.

కార్మికుల పొట్టకొట్టొద్దు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

చిల్లకూరు : మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పని చేసే కార్మికులను ప్రయివేటు ఏజెన్సీల కిందకు తీసుకువచ్చి వారి పొట్ట కొట్టొద్దని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ నాయకులు కోరారు. వారు ఆదివారం కార్మికులతో కలిసి గూడూరులోని ఎమ్మెల్యే కాంప్ కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. అంతకుముందు వారు మున్సిపల్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం ఆప్కాస్‌ను తీసుకుని వచ్చిందన్నారు. తద్వారా వారికి క్రమం తప్పకుండా జీతాలు ఇచ్చిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను పక్కన పెట్టి కార్మికుల భవిష్యత్తును ప్రయివేటు ఏజెన్సీల చేతికి అప్పగించాలని నిర్ణయించడం దారుణమన్నారు. దీంతో వేలాది మంది కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయకుండా ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి గోపీనాథ్, గౌరవ అధ్యక్షుడు జోగి శివకుమార్, డి.కోటేశ్వరరావు, వెంకటరమణ, రాజేష్, మణి, రాఘవ, సంపూర్ణమ్మ, మణెమ్మ, నారాయణమ్మ, సీఐటీయూ నాయకులు బీవీ రమణయ్య, ఎస్ సురేష్, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాళెం జాతీయ రహదారి కూడలి ప్రాంతంలో ఆదివారం లారీ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం మేరకు.. పోటుపాళెంకు చెందిన సింగిశెట్టి చంద్ర బైక్‌లో గూడూరు నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. జాతీయ రహదారిలో నెల్లూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు చీరల అందజేత

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు సరుకులు, చీరలు అందజేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కె.ఆదిశేషారెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, క్లబ్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి కలుగుతుందన్నారు. అనంతరం లయన్ ఎం.రాధాకృష్ణ దాతృత్వంతో సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యదర్శి శివయ్య మిక్సీ బహూకరించారు. అదేవిధంగా గూడూరులోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పాణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మల్లికార్జున్‌రెడ్డి ఆదివారం నిరుపేదలకు సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పాణకా మల్లికార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులు సంస్థకు లైఫ్ టైమ్ ప్రాజెక్ట్ ద్వారా ప్రతినెలా క్రమం తప్పకుండా సరుకులు అందజేస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పీడీ కరీముల్లాఖాన్, రాము, కుమార్‌నాయుడు, నాగరాజు, మల్లికార్జున, యశ్వంత్, కృష్ణారెడ్డి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 52.386 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 52.396 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 620, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కోర్కెలు తీర్చే సంతానేశ్వర స్వామి

- కాళంగి జలాలతో శివయ్యకు అభిషేకం
- శివరాత్రికి ముస్తాబవుతున్న సంతానేశ్వరస్వామి ఆలయం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు





మహాశివరాత్రికి ముస్తాబవుతున్న సంతానేశ్వరస్వామి ఆలయం, శివలింగం

సూళ్లూరుపేట : కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా సంతానేశ్వరస్వామి వెలుగొందుతున్నాడు. మహా శివరాత్రి పర్వదినాన 108 చెంబుల కాళంగి నదీ జలాలతో అభిషేకం చేస్తే కోర్కెలు ఫలిస్తాయని భక్తుల నమ్మకం. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న సంతానేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఆలయంలో శివలింగం భూమికంటే లోతట్టు ప్రాంతంలో వుండడం, స్వామికి పైభాగంలో వున్న పద్మంలో నీరు పోస్తే అవి నేరుగా శివుడి మీద పడడమే ఇక్కడి ప్రత్యేకత. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు న్యూకాలనీ సమీపంలో కాళంగి నదీ తీరాన వెలసిన సంతానేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శివలింగం ఎంతో మహిమాన్వితమైనదని భక్తులు నమ్ముతారు. సుమారు 500 ఏళ్ల క్రితం ఇక్కడ కొన్ని ముస్లిం కుటుంబాలుండేవి. ఇందులో ఒక ముస్లిం కుటుంబానికి చెందిన వ్యక్తి పొలంలో వరి పైరు వేసేందుకు పొలాన్ని దున్నుతుండగా నాగలికి శివలింగం, సుబ్రమణ్యం స్వామి విగ్రహాలు తగిలాయి. అతను వాటిని పెరికి పారేసి పొలాన్ని దున్నాలని ప్రయత్నించాడు. విగ్రహాలను పెకలించినా రాకపోవడంతో వాటి వరకు వదిలేసి పొలం సాగు చేసుకుంటూ వచ్చాడు. అప్పటి నుంచి ఈ రెండు విగ్రహాలకు గ్రామస్తులు శివరాత్రి రోజున కాళంగినదిలో నీరు తెచ్చి అభిషేకం చేస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన ఈ శివలింగానికి అభిషేకం చేస్తే చాలామందికి సంతానప్రాప్తి కలిగిందని, ఆ నమ్మకంతోనే ఈ ఆలయానికి సంతానేశ్వరస్వామి ఆలయంగా పేరు వచ్చిందని ప్రతీతి. ఈ విగ్రహాలు భూమి లోపల ఎంత లోతులో వున్నాయో చూద్దామని స్థానికులు ప్రయత్నించారు. సుమారు 10 అడుగులు దాకా తవ్వారు. ఇంకా చాలాలోతు ఉన్నట్టు తెలియడంతో వదిలేశారు. ఆ తర్వాత ముస్లిం కటుంబాల వారిని అడిగి ఆలయానికి ఐదు సెంట్ల స్థలం తీసుకుని కొండేపాటి గంగాప్రసాద్, అత్తిరాల వీరాస్వామి దాతృత్వంతో చిన్న పాటి ఆలయాన్ని నిర్మించారు. 1999లో రాజమండ్రి నుంచి తమిళనాడుకు వలస వచ్చిన మల్లికార్జునస్వామి, ప్రముఖ యోగా గురువు బాలాజీస్వామి ఈ ఆలయం గురించి తెలుసుకుని లోకనాథం అనే వ్యక్తితో కలిసి దీన్ని అభివృద్ధి చేశారు. ఈ ఆలయ ప్రాశస్త్యం గురించి అందరికీ తెలియజేయడంతో ప్రముఖ శివాలయంగా మారింది.



శివరాత్రి రోజున కాళంగినది నుంచి నీరు తీసుకొస్తున్న భక్తులు(ఫైల్)

శివరాత్రికి ఏర్పాట్లు

నెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి నుంచే భక్తులు భక్తిశ్రద్ధలతో కాళంగి జలాలను 108 సార్లు తీసుకొచ్చి స్వామి వారికి సమర్పిస్తారు. దీనికితోడు నదిలోని స్వచ్ఛమైన ఇసుక తీసుకొచ్చి లింగాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం ఆనవాయితీ. బుధవారం శివరాత్రి రోజున వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు కాళంగి నదికి, ఆలయానికి తిరుగుతూనే వుంటారు. సంతానం కావాలని, ఉద్యోగం కావాలని, చదువులు బాగా రావాలని, పెళ్లి కావాలని అనుకుని శివలింగంపై జలాభిషేకం చేస్తారు. తమిళనాడు నుంచి ముందురోజే భక్తులు వచ్చి ఇక్కడ నిద్రచేసి జలాభిషేకం చేస్తుంటారు.

నేదురుమల్లి అనుచరుడి మృతి



ఈదూరు రఘుపతి నాయుడు (ఫైల్)

చిట్టమూరు : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అనుచరుడు చిట్టమూరు మండలం యల్లసిరికి చెందిన ఈదూరు రఘుపతి నాయుడు(68) ఆదివారం మృతి చెందారు. ఆయన జనార్దన్‌రెడ్డి హయాంలో యల్లసిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్నారు. ఆయనను కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం స్వగ్రామం యల్లసిరికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికదేహంపై పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.